క్లుప్తంగా

ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించరాదు

పీసీపల్లి: ఆటోలో ఎక్కువ మంది ప్రయాణించరాదని పీసీపల్లి ఎస్సై జి.కోటయ్య అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వ్యవసాయ కూలీలను పనులకు తీసుకువెళుతున్న ఆటోలు వారిని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎక్కువ మంది ప్రయాణం చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆటోడ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. మరోసారి నిబంధనలు అతిక్రమిస్తే ఆటో సీజ్ చేస్తామని హెచ్చరించారు.

గ్రామసభకు 32 అర్జీలు



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ కిషోర్‌రెడ్డి

హనుమంతునిపాడు: మండలంలోని కిష్టంపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన గ్రామసభకు 32 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ కిషోర్‌రెడ్డి, మండలసర్వేయర్ కాకర్ల రమణయ్య, వీఆర్వో పరుశురామ్, సచివాలయ సర్వేయర్లు రాజశేఖర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



రిజిష్టర్లు తనిఖీ చేస్తున్న ఏఓ విజయ్‌కుమార్

కొండపి: ఎరువులను రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి ఎరువులు విక్రయిస్తున్న షాపు డీలర్లు తప్పనిసరిగా ధరల పట్టికలో వివరాలు నమోదు చేయాలన్నారు. రికార్డులు సక్రమంగా లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనధికారికంగా ఎరువులు విక్రయిస్తే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో వీఏఏ శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష

కొండపి: సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి డాక్టర్ పి.అనూష అన్నారు. స్థానిక పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లు వారికి కేటాయించిన గ్రామ పరిధిలో ఇంటింటికీ వెళ్లి జ్వరాల కేసులు సర్వే చేయాలన్నారు. జ్వర బాధిత కేసులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే డాక్టర్లు సంప్రదించాలని సూచించారు. జిల్లా సబ్ యూనిట్ అధికారి భాస్కర్‌బాబు, పెట్లూరు హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీ నరసింహం,, హెచ్‌వీ అన్నపూర్ణమ్మ, యూడీసీ అనీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

హనుమంతునిపాడు: పొదుపు సంఘాల్లో నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా చేసేందుకు మండల మహిళా సంఘాల్లోని అధ్యక్ష, కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీఓ రంగ సుబ్బరాయుడు అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వయోజన విద్య కేంద్రాల నిర్వహణపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సంఘాల్లో చదువు వచ్చిన వారు చదువు రాని వారిని గుర్తించి కేంద్రాల్లో చదువు నేర్పాలన్నారు. సంఘాల పరిధిలో ప్రతి మహిళ విద్యావంతురాలై ఉండాలని సూచించారు. సీసీలు వయోజన విద్యా కేంద్రాల నిర్వహణపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ ఎస్.రమణయ్య, ఏపీఓ ఎం.రజనికుమారి, సీసీలు డేనియేలు, తిలకమ్మ పాల్గొన్నారు.

6 మద్యం బాటిళ్లు స్వాధీనం

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం వావిలేటిపాడులో మంగళవారం బెల్టుషాపు నిర్వహిస్తున్న నాగేశ్వరమ్మను అదుపులోనికి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం శివ కుమారి తెలిపారు. ఈమె వద్ద నుంచి 6 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.

రైతన్నకు బీమా భారం

- ఉచిత బీమా పథకానికి కూటమి ప్రభుత్వం తూట్లు
- రైతన్నకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



వరి నాట్లు నాటుతున్న కూలీలు(ఫైల్)

మద్దిపాడు: అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతుల సంక్షేమాన్ని విస్మరించింది. ఈ రబీ సీజన్ నుంచి కూటమి ప్రభుత్వం అన్నదాతలకు భారీగా షాక్ ఇవ్వనుంది. వ్యవసాయంతో పాటు ఇతర పంటలు పండిస్తున్న రైతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు ఎంతో అండగా నిలిచి వారిలో మనోధైర్యం నింపింది. అయితే వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడిచింది. ఇకపై తుఫాన్ ఇతర ప్రకృతి వైపరీత్యం వల్లా ఎలాంటి విపత్తుల సమయంలో బీమా అందాలంటే నోటిఫైడ్ చేసిన పంటలకు సంబంధించిన బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించుకోవాలని ప్రకటించింది. అన్నదాతలపై అదనపుభారం పడే విధంగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రైతులు మండిపడుతున్నారు.


వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉచిత బీమా

ప్రతి ఏటా ప్రకృతి విపత్తుల సమయంలో రైతులు నష్టపోతున్నారు. కొన్ని సందర్భాల్లో బీమా చెల్లించుకోకపోవడంలో ప్రకృతి విపత్తుల సమయంలో నష్టపరిహారం అందుకోలేకపోతున్నారు. అటువంటి పరిస్థితులు లేకుండా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతల సంక్షేమం కోసం విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రాపు బుకింగ్ విధానంతో ప్రతి రైతు వివరాలు నమోదు చేసి వారికి ఉచిత పంటల బీమాను వర్తింపజేశారు. వాస్తవానికి వరి పంటకు రూ. 600 చెల్లించాలి. ఉద్యానవన పంటలైన మామిడి, జీడికి సుమారు రూ.4వేలు ప్రీమియం చెల్లించాలి. ఆ మొత్తాన్ని అప్పటి ప్రభుత్వమే చెల్లించేది. దీంతో రైతులకు ఎలాంటి బాధ, బెంగ లేకుండా బీమా విషయంలో రైతులు దీమాగా ఉన్నారు.

మండలంలో రూ. 37 కోట్లు చెల్లింపు

వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకంలో భాగంగా మద్దిపూడి మండలంలో ఒక్క వ్యవసాయానికి సంబంధించి సుమారు 8500 మంది రైతులకు ఉచితంగా బీమా నమోదు చేశారు. అందులో సుమారు 6500 మంది రైతులకు రూ. 37కోట్ల రూపాయలు చెల్లింపుచేశారు. ఇప్పుడు తాజాగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రీమియంభారం రైతులపై పడింది. ఈ రబీ సీజన్ నుంచి రైతులంతా వరికి సంబంధించి డిసెంబరు 31 తేదీ లోగా 40 శాతం రైతు వాటా కింద ఎకరాకు రూ. 215 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. అలాగే శనగ ఎకరాకు రూ.368 చెల్లించాలి. మినుము ఎకరాకు రూ. 103, మొక్కజొన్న ఎకరాకు రూ. 105, ఎండు మిర్చి ఎకరాకు 50 శాతం రైతువాట పోనూ రూ. 525 చెల్లించాలి. జొన్నపంట ఎకరాకు రూ.60 వచ్చే డిసెంబర్ 15వ తేదీ లోగా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

ఉచిత పంటల బీమాకు మంగళం:



చంద్రబాబు అధికారంలోకి వస్తే రైతులకు ఇబ్బందులు కొత్తేమి కాదు. రైతులనే ప్రీమిం చెల్లించాలంటూ వారిపై అదనపు భారం మోపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు అండగా ఉండేది. ఇప్పుడు మళ్లీ రైతులకు కష్టాలు మొదలయ్యాయి. నిన్నటి వరకు సరిగ్గా విత్తనాలు, ఎరువులు అందలేదు. ఇప్పుడు ఉచిత పంటల బీమాకు మంగళం పాడేస్తున్నారు.

బోద రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ మాజీ మండల అధ్యక్షుడు

రైతులను ఇబ్బంది పెట్టడం తగదు:



అధికారంలో ఉన్న ప్రభుత్వాలు రైతులకు మంచి చేయాలి. అంతే తప్పా రైతులకు అనుకూలంగా ఉన్న పథకాలను నిలిపివేయడం మంచి పద్ధతి కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉచిత పంటల బీమా పథకం వల్ల ఎంతో మంది రైతులకు మేలు జరిగింది. కానీ రైతులే చెల్లించాల్సి రావడం అదనపు భారమే

దారుకుమల్లి పెద్దిరెడ్డి, రైతు

యాజమాన్య పద్ధతులు పాటించాలి



జామ తోటలు పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి అంజలీబాయి



అనంతవరంలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ స్వర్ణలత

హనుమంతునిపాడు: పండ్ల తోటల రైతులు ఉద్యానవనశాఖ అధికారులు ఇచ్చిన సలహాలు సూచలు పాటించాలని కనిగిరి డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి ఎం.అంజలీబాయి అన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో తైవాన్ జామ తోటలకు సోకిన తెగుళ్లను మంగళవారం ఆమె పరిశీలించారు. కాయక వచ్చిన మచ్చలు, పగుళ్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు అధికారులు సలహాలు సూచల మేరకు తెగుళ్ల నివారణ మందులు వాడాలన్నారు. జామలో పండు ఈగ, తెల్ల సుడి దోమ, పిండినల్లి, నులిపురుగు ఎక్కువగా ఆశించినట్లు గుర్తించారు. వాటి వల్ల కాయకు మచ్చ, పలగుళ్ల వచ్చి నాణ్యత కోల్పోయినట్లు తెలిపారు. వాటి నివారణకు కాయ పిందె దశలో తగిన నివారణ చర్యలు పాటిస్తే తోటలో కాపును కాపాడుకోవచ్చన్నారు. రైతు దోసపాటి నర్సయ్య, వీఏఏ సుప్రజ ఉన్నారు.

పీసీపల్లి: రైతులంతా ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గ చూడాలని వ్యవసాయాధికారి రమణ అన్నారు. మండలంలోని గుదేవారిపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోందిలో భాగంగా పొగాకు రైతులకు అవగాహన కల్పించారు. రానున్న రోజుల్లో పొగాకు పంటకు ధర తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలైన మినుము, ఇతర పంటలు సాగు చేయాలన్నారు.

పొమూరు: కందిపైరును ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి రాధ అన్నారు. మండలంలోని కంబాలదిన్నె, వెంకటాపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈసందర్భంగా కందిపైరును పరిశీలించిన ఏఓ వర్షాలు కురిసిన నేపథ్యంలో కందిపైరు పచ్చగా, గుబురుగా పెరిగి ఉందని మరుకా మచ్చలపురుగు, శనగమచ్చపురుగు గుడ్లను పెట్టే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. దీన్ని నివారించేందుకు వేపనూనె, క్లోరో 50 ఈసీ మందులను కల్తి కనిపించిన వెంటనే పిచికారీ చేసి గూడుపురుగును నివారించాలని సూచించారు.

టంగుటూరు: రైతులు రాయితీపై శనగ విత్తనాలు తీసుకోవాలని వ్యవసాయాధికారి స్వర్ణలత అన్నారు. మండలంలోని అనంతవరం, వెలగపూడి పంచాయతీల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్య శాఖాధికారి రవికుమార్ మాట్లాడుతూ ఆక్వా సాగు రైతుల కోసం పాలేరునది పూడిక తీసేందుకు ఉన్నతాధికారుల అనుమతి కోసం పంపించామని, అనుమతులు వచ్చిన వెంటనే పనులు పూర్తి చేస్తామన్నారు. సర్పంచి ఉప్పలపాటి శివరామరాజు, వెలగపూడి సర్పంచ్ కోటపాటి వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండపి: మండలంలోని చిన్నకండ్లగుం, తాటాకులపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్ సూచనలు చేశారు. ఏఈఓ తేజస్విని, గ్రామ వ్యవసాయ సహాయకులు మహేష్, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు



కనిగిరి: బాబా దేవస్థానంలో నాగేంద్రునికి పూజలు



టంగుటూరులో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు



తిరుమలనాథస్వామి ఆలయం పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు



బొడ్డు చావిడి వద్ద నాగ శిలలకు పూజల్లో భక్తులు



దొరువు వద్ద గల పుట్ట వద్ద భక్తుల పూజలు



సింగరాయకొండలో కోటి దీపోత్సవం

కనిగిరి రూరల్: నాగులచవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు నాగుపాము పట్టల వద్ద నియమ నిష్టలతో నాగుపుట్టల్లో పాలు పోసి, నైవేద్యాలు సమర్పించారు. స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానంలో ఉన్న నాగేంద్ర స్వామికి కార్తీక దీపాలు వెలిగించారు. స్వామికి నాగభూషణ పంచామృత రుద్రాభిషేకాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం, భాగ్యలక్ష్మీ దంపతులు నిర్వహించారు. భక్తులు విశిష్ట పూజలు చేశారు. బొడ్డుచావిడి వద్ద ఉన్న నాగ శిలలకు, దొరువు వద్ద ఉన్న నాగేంద్రుని పుట్టకు, కాశీ విశ్వేస్వర సమేత ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మాచవరం, డిగ్రీ కళాశాల వద్ద ఉన్న నాగ పుట్టల వద్ద భక్తులు బారులు తీరారు. కృష్ణాపురంలో గల నాగపుట్ట వద్ద భక్తులు అధిక సంఖ్యలో వెళ్లి కార్తీక దీపాలు వెలిగించి విశిష్ట పూజలు చేశారు.

పొమూరు: నాగులచవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక అంకాళమ్మవీధిలో ఉన్న సుబ్రమణ్యేశ్వరస్వామి పుట్టవద్ద అర్చకులు జంట నాగుల శిలలకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కందుకూరురోడ్డులోని పుట్టతోపాటు స్థానిక మదన వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఉన్న జంటనాగులకు, సీఎస్‌పురం రోడ్డులోని పుట్టవద్ద భక్తులు విశేష పూజలు చేశారు. నాగులచవితిని పురస్కరించుకొని భక్తులు ఉపవాసం ఉండి పూజలు చేశారు. వేణుపాలస్వామి ఆలయం, సత్యనారాయణస్వామి, అయ్యప్ప ఆలయాల్లో కార్తీకమాస పూజలు చేశారు.

సీఎస్‌పురం(పొమూరు): మండలంలో నాగులచవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీఎస్‌పురంలోని కామాక్షీసమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో భక్తులు పుట్ట, జంట నాగులకు విశిష్ట పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. మండలంలోని అయ్యలూరివారిపల్లె తిరుమలనాథస్వామి ఆలయ ప్రాంగణం పుట్ట వద్ద అర్చకులు రామమూర్తి విశిష్ట పూజలు చేశారు. శీలంవారిపల్లెలో నాగమయ్య ఆలయంలో స్వామి మూలవిగ్రహమూర్తికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

సింగరాయకొండ: మండలంలో నాగులచవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆంజనేయనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో పుట్ట వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో నాగేంద్రస్వామికి ఉపవాసదీక్షలతో పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి ఆలయం వద్ద కోటిదీపోత్సవం ఘనంగా జరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టంగుటూరు: మండలంలో నాగులచవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు నియమనిష్టలతో ఉపవాసదీక్షలతో పుట్ట వద్దకు వెళ్లి పూజలు చేశారు. జమ్ములపాలెం, టంగుటూరు, పొందూరు, జయవరం, స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న పుట్ట వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి పాలు పోసి, పూజలు చేశారు.

రసూల్‌రెడ్డికి ఘన నివాళి



రసూల్‌రెడ్డి భౌతికకాయంవద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు, నేతలు

సీఎస్‌పురం(పొమూరు): మండలంలోని కోవిలంపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోను రసూల్‌రెడ్డి (85) సోమవారం ఉదయం మృతిచెందాడు. ఈసందర్భంగా మంగళవారం కనిగిరి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు కదిరి బాబూరావు, కదిరి విద్యాసంస్థల చైర్మన్ కదిరి ప్రకాశ్‌రావు, సెక్రటరీ కదిరి పార్థసారదిలు స్థానిక నాయకులతో కలిసి మృతుడు రసూల్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుమారుడు గోను చంద్రశేఖర్‌రెడ్డితో పాటు కుటుంబసభ్యులను పరామర్శించారు. ముందుగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పార్టీ నాయకులు రుసుం అహమ్మద్ నివాసానికి వెళ్లి ఆయన్ను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.బజాజ్‌బుజ్జి, నారాయణస్వామి ఆలయ మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, మాజీ ఎంపీటీసీ మూరం తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం

కనిగిరి రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం లభిస్తోందని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శివనగర్, సాయినగర్ కాలనీల్లో చైర్మన్ గఫార్ మంగళవారం పర్యటించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఇళ్లల్లో నుంచి చెత్త, వ్యర్థాలను రోడ్లపై కాలువల్లో వేయకుండా చెత్త రిక్షాలో లేదా, మున్సిపల్ కార్మికులకు అందచేయాలని సూచించారు. వార్డులో తక్షణ పారిశుధ్య కార్యక్రమాలు చేయించారు. వికలాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు దూళిపాళ్ల మల్లికార్జునరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు



శిక్షకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

జరుగుమల్లి(సింగరాయకొండ): ప్రకృతి వ్యవసాయం ఎంతో ఏలని జిల్లా వ్యవసాయాధికారి, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్ శ్రీనివాసరావు అన్నారు. ఆత్మ ప్రకాశం ఆధ్వర్యంలో జరుగుమల్లి వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం గ్రామీణ యువతకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఏఓ యుగంధర్‌రెడ్డి, డీపీడీ ఆత్మ ఎం సుబ్రమ్మణ్యేశ్వరరావు, జిల్లా శిక్షణా కేంద్రం సమన్వయకర్త ఎస్ రామ్మోహన్‌రావు, డీఆర్‌సీ ఏడీఏ జె వెంకటరావు, సింగరాయకొండ ఏడీఏ నిర్మలాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

టంగుటూరు: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ సారించి మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు చూడాలని డీఈఓ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని తూర్పునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాలలోని రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతం పెంచాలని సూచించారు. డిప్యూటీ డీఈఓ సుబ్బారావు, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు సెక్రటరీ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు సుధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మద్దిపూడి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లోసేకరించిన రేషన్ బియ్యాన్నికొండపికి చెందిన వ్యక్తి 14 బస్తాల్లో నింపుకొని మద్దిపూడి నుంచి కొండపి వైపు ట్రాలీ ఆటోలో వెళుతున్నాడు. ఈ క్రమంలో కూచిపూడి శివారులో పోలీసు తనిఖీల్లో 4 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎస్సై రమేష్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

కొండపి: అక్రమంగా రవాణా చేస్తున్న 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు కొండపి ఎస్సై ప్రేమ్ కుమార్ తెలిపారు. కొండపిలోని అనకర్లపూడి రోడ్డులో తనిఖీ చేయగా చలువాది కోటేశ్వరరావు అనే వ్యక్తి 15 మద్యం సీసాలనుతరలిస్తుండగా పట్టుకున్నామని పేర్కొన్నారు.

నైపుణ్య శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోండి

- కమిషనర్ డానియల్ జోసఫ్



మాట్లాడుతున్న కమిషనర్ డానియల్ జోసఫ్

కనిగిరి రూరల్: నిరుద్యోగ యువతి, యువకులు నైపుణ్య శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసఫ్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నైపుణ్య గణన శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ డి.జోసఫ్ మాట్లాడుతూ త్వరలో ప్రారంభమయ్యే నైపుణ్య గణన కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలన్నారు. 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల లోపు వారి వద్ద నుంచి సరైన విద్యార్హతలు, ఉద్యోగ అనుభవం, ఉద్యోగ ఆశక్తులు, తదితర సమాచారాన్ని ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. మేనేజర్ ఇనుపగుర్ల ప్రసాద్‌రావు, ప్లానింగ్ కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వే నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, వీపీలు పాల్గొన్నారు. ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు మాట్లాడుతూ నైపుణ్య గణనపై ఇంటింటికి తిరిగి సర్వే చేయాలన్నారు. సర్వే సిబ్బంది జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలన్నారు. ఆర్‌పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: స్థానిక ఎమ్మార్సీలో నైపుణ్య గణనపై ఎంపీడీఓ ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో అవగాహనకార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనకు వారికి అవసరమైన నైపుణ్యాలు మెరుగుపరిచేందుకు శిక్షణ ఇస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ వద్ద బ్రాందీషాపు ఏర్పాటు చేయొద్దు

- మంత్రికి ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

కొండపి: నిత్యం జనసంచారంతో ఉంటే ఉచిత తాగునీటి ప్లాంట్ సమీపంలో బ్రాందీషాపు ఏర్పాటును నిలుపుదల చేయాలని గ్రామస్తులు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయస్వామికి వినతిపత్రం ఇచ్చారు. కొండపిలోని పొదిలి రోడ్డులోని గుడిపల్లి చందుకల్యాణ మండపం, దాని పక్కనే ఉచిత తాగునీటి ప్లాంట్, పక్కనే చాణక్య కళాశాల ఉండగా వాటికి అతి సమీపంలో బ్రాందీషాపు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు. దీని వల్ల ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతారన్నారు. మంత్రి దీనికి సానుకూలంగా స్పందించి బ్రాందీషాపును మరో ప్రాంతానికి మార్చాలని సూచించినట్లు తెలిపారు.

ఉపాధిలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

- రూ.4.66 కోట్ల నిధుల రికవరీకి ఆదేశం



మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

సీఎస్‌పురం(పొమూరు): ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ జోసఫ్ హెచ్చరించారు. ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ 16వ ప్రజావేదిక మంగళవారం ఏపీఓ వాక్యవతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 23 పంచాయతీల్లో 399 పనులకు సంబంధించి ఖర్చు చేసిన రూ.10.83 కోట్ల వివరాలపై ప్రజావేదికలో డీఆర్పీలు వివరించారు. పెదగోగులపల్లి గ్రామానికి చెందిన 11 మంది రైతులు ఉపాధి పథకం కింద బత్తాయి మొక్కలు వేసుకుని సాగుచేసుకుంటున్నా ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించలేదని చెప్పగా తక్షణం బిల్లులు చెల్లించాలని పీడీ ఆదేశించారు. ఉపాధి పనుల్లో చేసిన కొలతలు తేడాలు ఉన్నట్లు సమావేశంలో వివరించారు. టీఏలు, ఎఫ్ఏలు బాధ్యతాయుతంగా పనిచేయాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అవినీతికి పాల్పడిన ప్రతి రూపాయి రికవరీ చేస్తామన్నాని తెలిపారు. కార్యక్రమంలో డీవీఓ ఝాన్సీరాణి, ఏపీడీ రాజారావు, ఎస్ఆర్‌పీ వెంకటేశ్వరరావు, డీఆర్‌పీలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



సింగరాయకొండలో వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

సింగరాయకొండ: 104 ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆంధ్రప్రదేశ్ 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వంశీధర్‌కు, జరుగుమల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ కావ్యకు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, దీంతో కుటుంబ పోషణ భారంగా ఉందని, జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్లు, డీఈఓలకు జీఓ నంబర్ 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అడకా శ్రీకాంత్, నారాయణ, డీఈఓలు శ్వేత, స్వాతి పాల్గొన్నారు.

ట్రాక్టర్ చోరీ

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలోని కామేపల్లి గ్రామానికి చెందిన ప్రత్తిపాటి నరశింహారావు తన కొష్టంలో పెట్టిన ట్రాక్టర్ చోరీకి గురైందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు తెలిపిన సమాచారం ప్రకారం నరశింహారావు నేతివారిపాలెం వెళ్లే రోడ్డులో ఉన్న తన పొగాకు కొష్టం వద్ద ట్రాక్టర్ సోమవారం రాత్రి ఉంచి ఇంటికి వచ్చాడు. కానీ తెల్లవారి వెళ్లి చూసే సరికి ట్రాక్టర్ లేదని సమీపంలోని సీసీ కెమెరాల్లో పరిశీలించినా ప్రయోజనం లేదని, దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మోటారుసైకిలిస్టుకు తీవ్ర గాయాలు

సింగరాయకొండ: రెండు మోటారుసైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పాకల రోడ్డులో మొహిద్దీన్‌బాషా బ్యాటరీ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో షాపు వద్దకు వెళ్లేందుకు ఇంటివద్ద నుంచి వచ్చే క్రమంలో పాకల రోడ్డు వైపు తిరుగుతుండగా ఒంగోలు వైపు అతి వేగంగా వస్తున్న మోటారుసైకిలిస్టు ఎదురుగా వచ్చిన మొహిద్దీన్ బాషా మోటారుసైకిల్‌ను తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు బలంగా ఢీ కొట్టాడు. ప్రమాదంలో మొహిద్దీన్‌బాషాకు ఎడమ పాదం విరగ్గా, మరో మోటారుసైకిలిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. మొహిద్దీన్‌బాషాను 108లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించగా, మోటారుసైకిలిస్టు గాయాలతోనే వెళ్లిపోయాడు. ఇతని వివరాలు తెలియరాలేదు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థితో హెచ్‌ఎం, పీడీ

పొమూరు: మండలంలోని కంబాలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కుడుముల సందీప్ అండర్-17 విభాగంలో క్రికెట్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సిద్ధమూర్తి లక్ష్మిరెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన సందీప్‌ను అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ సోమవారం కనపర్తిలో జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన సందీప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికయ్యాడన్నారు. పీఈటీ ఎం నరసింహారావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.